సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

సోమవారం 11-11-2024
శ్రీకాకుళం

సంపుటి: 20 సంచిక: 193
పేజీలు: 4 వెల: రూ.1









## హార్థిక శుభాకాంక్షలు



గౌ॥ శ్రీమతి **కావలి గ్రీష్మ** గారు
ఏపీ ఉమెన్స్ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్
తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి,
డైరెక్టర్: డాక్టర్ జస్టిస్ కొత్తపల్లి పున్నయ్య ట్రస్ట్





చాన్నాళ్లకు మళ్లీ మా 'భారతి' మేడమ్
ఇంటికి వసంతం వచ్చింది..
ఈ రాష్ట్రంలో మళ్లీ కొత్త ఆశలు
చిగురిస్తున్నాయ్.. 'ప్రతిభా' పూలు
వికసిస్తాయని కాబోలు..
ప్రత్యర్థికి తన వాడి, వేడి మహానాడు
సాక్షిగా చూపించిన 'గ్రీష్మ'మ్మకు
ఏపీ ఉమెన్స్ కోపరేటివ్ ఫైనాన్స్
చైర్‌పర్సన్‌గా నియమించిన పార్టీకి,
ప్రభుత్వానికి శరదృతువు, హేమంత
శిశిరంలో కూడా 'కావలి'గా
ఉంటామని మాటిస్తున్నాం..
మరొక్కసారి మా సోదరి కావలి గ్రీష్మకు
హార్థిక శుభాకాంక్షలు



# ఆదిత్య కిరణ్ & ఫ్యామిలీ

• ఎడిటోరియల్

# ట్రంప్ గెలుపు సూచిస్తున్నదేమిటి?

మరో శక్తిమంతమైన నాయకుడు ఎన్నికయ్యాడు. ప్రపంచంలో అతి పురాతన ప్రజాస్వామిక వ్యవస్థ అమెరికాలో దేశాధ్యక్ష పదవీ ఎన్నికలో డోనాల్డ్ ట్రంప్ కచ్చితమైన, చరిత్రాత్మక విజయం సాధించారు. అమెరికాలో ఎన్నికల ప్రక్రియ న్యాయబద్ధతను ఎవరూ ప్రశ్నించరు, ప్రశ్నించలేరు. అమెరికాను మళ్లీ గొప్ప దేశంగా రూపొందించుకుందాం అన్న నినాదంతో డోనాల్డ్ ట్రంప్ ఎన్నికల ప్రచారం చేశారు. అయితే ప్రచార పర్వంలో ఆయన ప్రసంగాలు స్త్రీలను కించపరిచేవిగాను, జాత్యహంకారాన్ని రెచ్చగొట్టేవిగాను, ప్రజలలో విభేదాలు, చీలికలు సృష్టించేవిగాను, ప్రత్యర్థులను అమితంగా దుర్భాషలాడినవిగా ఉన్నాయని అమెరికా అధ్యక్ష ఎన్నికల ఘటనలు, ప్రచార వైనాల స్వతంత్ర పరిశీలకులు, నిష్పాక్షిక మీడియా ప్రతినిధులు అంగీకరించారు. అయితే అమెరికా ప్రజలలో అత్యధికులు ట్రంప్ ప్రచార తీరుతెన్నులను ఏ మాత్రం పట్టించుకోనేలేదు. వలసలు, ద్రవ్యోల్బణం, పెచ్చరిల్లిన నేరాలు తదితర అంశాలకు మాత్రమే ప్రాధాన్యమిచ్చారు. ఆ సమస్యల నుంచి ఎవరు తమను బయట పడవేయగలరని మాత్రమే వారు ప్రధానంగా ఆలోచించారు. ద్రవ్యోల్బణాన్ని మినహాయిస్తే మిగతా రెండు మనం 'బతుకుతెరువు' అంశాలుగా పరిగణించేవి కావు. వాటిని మంచి జీవితాన్ని నిర్మించుకోవడంలో సాఫల్య వైఫల్యాలకు సంబంధించినవిగా అభివర్ణించవచ్చు. అమెరికాకు వలస వస్తున్నవారు 'మనలాంటి వారు కారు' అన్నది రిపబ్లికన్ల అభిప్రాయం. ఈ పరాయివారు శ్వేత జాతీయులైన అమెరికన్ క్రైస్తవ పౌరులను ముంచెత్తుతున్నారని, ఫలితంగా అమెరికా ప్రజలు అనేక ఆర్థిక ఇక్కట్లకు లోనవుతున్నారంటూ వలసకారులకు వ్యతిరేకంగా రిపబ్లికన్లు ముమ్మర ప్రచారం చేశారు. దశాబ్దాల క్రితం అమెరికాకు వలస వెళ్లినవారు (ప్రధానంగా లాటినో ఓటర్లు) సైతం కొత్త వలసకారుల నుంచి తమ మనుగడకు తీవ్ర ముప్పు వాటిల్లనుందని గట్టిగా భావిస్తున్నారు. సరే ద్రవ్యోల్బణం ప్రతి దేశంలోనూ ప్రతి ఒక్కరికీ సమస్యలు సృష్టిస్తోంది. అమెరికాలో ద్రవ్యోల్బణాన్ని 2.4 శాతానికి కట్టడి చేశారు. అమెరికా ఫెడరల్ రిజర్వ్ విధాన వడ్డీ రేటును తగ్గించడానికి సిద్ధంగా ఉన్నది (ద్రవ్యోల్బణం తక్కువగా ఉందనేందుకు ఇదొక సూచన). అయినప్పటికీ ద్రవ్యోల్బణంను రిపబ్లికన్ పార్టీ ఒక ప్రచార అస్త్రంగా చేసుకున్నది. అనేక దేశాలలో మాదిరిగానే అమెరికాలోను నేరాలు బాగా పెరిగిపోయాయి. జనాభా పెరుగుదల, పట్టణీకరణ, మాదక ద్రవ్యాలే నేరాల పెరుగుదలకు ప్రధాన కారణాలు. వలసలు, ద్రవ్యోల్బణం, నేరాల పెరుగుదలను డోనాల్డ్ ట్రంప్ తన రాజకీయ లబ్ధికి గరిష్ఠంగా ఉపయోగించుకున్నారు. మొరటు భాషలో దుర్భాషలాడారు. అయినప్పటికీ అమెరికన్ ఓటర్లు ఆయన మొరటుతనం, ముతక విమర్శల పట్ల ఎటువంటి అభ్యంతరం, ఆక్షేపణ తెలుపకపోవడం ఆశ్చర్యం. ప్రపంచ వ్యాప్తంగా అసంఖ్యాక ప్రజలను కలవరపెడుతున్న వివిధ అంశాలు అమెరికా ఎన్నికల ప్రచారంలో కనీస ప్రాధాన్యం కూడా పొందలేదు! మధ్య ప్రాచ్యంలో యుద్ధం, ఉక్రెయిన్–రష్యా యుద్ధం పెద్దగా ప్రస్తావనకే రాలేదు. తైవాన్‌ను ఆక్రమించుకునేందుకు చైనా చేస్తున్న ప్రయత్నాలను అమెరికా ప్రజలు పూర్తిగా మరచిపోయినట్లుగా కనిపిస్తోంది అమెరికా భూభాగాలపై దాడి చేసేందుకు వీలైన ఖండాంతర క్షిపణుల ప్రయోగ పరీక్షలను ఉత్తర కొరియా విజయవంతంగా నిర్వహించిన విషయాన్ని ఇరు పార్టీల అభ్యర్థులూ మరచిపోయినట్టున్నారు. పలు దేశాలలో అంతర్యుద్ధాలు, ప్రజాస్వామిక దేశాలుగా పిలవబడుతున్న దేశాలలో పౌర స్వేచ్ఛల అణచివేతను అభ్యర్థులు గానీ, ఓటర్లు గానీ పట్టించుకోనే లేదు. ఈ అంతర్జాతీయ ఉపద్రవాలను అలా ఉంచితే తాము ఓటు వేస్తున్న (అంతిమంగా గెలిచిన) అభ్యర్థిని ఒక దోషిగా న్యాయస్థానం నిర్ధారించిందని, శిక్ష ఖరారు కావచ్చునే వాస్తవాన్ని కూడా అమెరికన్ ఓటర్లు పూర్తిగా విస్మరించారు. అమెరికాను ప్రపంచంలోనే అత్యంత సంపన్న దేశంగా రూపొందించిన స్వేచ్ఛా వాణిజ్య విధానాలు, తక్కువ సుంకాలు, గుత్తాధిపత్య వ్యతిరేక చట్టాల ఉపసంహరణ గురించి వారు ఏ మాత్రం పట్టించుకోనే లేదు. డోనాల్డ్ ట్రంప్ విజయానికి అమితంగా ఆనందపడిన కార్పొరేట్ శక్తులు చమురు, ఔషధాల తయారీ, అధునాతన సాంకేతికతలకు సంబంధించిన బహుళ జాతి కంపెనీలే. మరి ఆ దేశాధ్యక్ష పదవీ ఎన్నికల ఫలితం ఇతర దేశాలలోని ఎన్నికలను ప్రభావితం చేస్తుందా? చేయగలదు. ఎన్నికల ప్రచారంలో ఆయన ఉపయోగించిన మొరటు భాష, ప్రజలలో విభేదాలు చీలికలు సృష్టించిన వ్యాఖ్యల వైనాన్ని అనుకరించేందుకు ట్రంప్ విజయం ఇతర దేశాలలోని నాయకులను పురిగొల్పవచ్చు. ట్రంప్ ప్రచార నమూనా ఒక ఒరవడి అయితే అది ప్రజాస్వామ్యానికి ఘోర పరాజయం అవుతుంది.

జూహిత్ నందన్ క్రిష్ణ ట్రస్ట్

## సేవలు అమూల్యం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జూహిత్ నందన్ క్రిష్ణ ట్రస్ట్ సేవలు అమూల్యం ప్రముఖ వైద్యులు లయన్ డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ అన్నారు. స్థానిక ఎన్జీవో హోమ్‌లో జూహిత్ నందన్ క్రిష్ణ ట్రస్ట్ సహకారంతో లయన్స్ బ్లడ్‌బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించటం హర్షణీయమని, శిబిరంలో సుమారు 50 మంది రక్తదానం చేసి సహృదయాన్ని చాటుకున్నారన్నారని కొనియాడారు. ట్రస్ట్ చైర్మన్ ఉర్లాన గోపాలకృష్ణ మాట్లాడుతూ జూహిత్ నందన్ క్రిష్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు విరివిగా చేస్తున్నామని వివరించారు. ఈ సేవా కార్యక్రమాలను మరింత ఉన్నతంగా చేయడానికి దాతల సహాయ సహకారాలను స్వాగతిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా లయన్ డాక్టర్ బొడ్డేపల్లి సురేష్, జెసి సెనేటర్ డాక్టర్ కూర్మాన వినోద్ కుమార్, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ శ్రీలక్ష్మి, మెంబర్ గన్నెపుడు, ట్రస్ట్ సభ్యులు కృష్ణారావు, శేఖర్, ప్రవీణ్, బ్లడ్ బ్యాంకు మేనేజర్ కొంతం సునీల్, లయన్ ఉర్లం శివ తేజ, సుప్రజ రౌత్, నవీన్, బ్లడ్‌బ్యాంకు టెక్నిషన్స్, రక్త దాతలు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.




## 'స్వాస్' సేవలకు గుర్తింపు



సత్యంన్యూస్, విజయనగరం)

మాతృభూమి సేవా సంఘం, శ్రీ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నేషనల్ అవార్డు గ్రహీత పోలుబోతు దుర్గాప్రసాద్ సన్మానం సందర్భంగా రక్తదాన శిబిరం, స్వచ్ఛంద సంస్థల ఆత్మీయ సమ్మేళనం విజయనగరం యూత్ హాస్టల్ కనపాకలో జరిగింది. ముఖ్య అతిథులుగా రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ కేసలి అప్పారావు, ఉత్తరాంధ్ర చర్చావేదిక కోకన్వీనర్, రాష్ట్ర లోక్‌సత్తా అధ్యక్షులు బీశెట్టి బాబ్జి, ఏబీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ స్వరూప్ హాజరయ్యారు. స్వాస్ సేవా సంఘం అందించిన సేవలకు అధ్యక్షుడు బూర్లె పైడినాయుడును దుశ్శాలువతో అతిథుల చేతుల మీదుగా సన్మానించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ స్వాస్ సేవలు అద్భుతమన్నారు. ఈ సందర్భంగా బూర్లె పైడినాయుడు మాట్లాడుతూ ఈ సత్కారం స్వాస్ సేవాసంఘం సభ్యులైన ప్రతిఒక్కరికి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో అబ్దుల్ కలాం ఫౌండేషన్ మమ్ముల తిరుపతి, మాతృభూమి సేవా సంఘం కార్యదర్శి ఇప్పలవలస గోపి, బ్లడ్‌బ్యాంక్ మేనేజర్ నాగేశ్వర రావు, మేము సైతం ఆర్గనైజేషన్ కంది మురళి, హ్యూమన్ రైట్స్ సంతోష్, అశ్విని, సారథి వెల్ఫేర్ అసోసియేషన్ ప్రదీప్, సాధన యువజన సంఘం వెంకటరమణ, అమ్మ సేవాసమితి లక్కీ శేఖర్, ఎస్పీ యూత్ సొసైటీ ప్రవల్లిక తదితరులు పాల్గొన్నారు.

## కోటేశ్వరాలయానికి పోటెత్తిన భక్తులు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం జిల్లాలో పంచలింగ క్షేత్రాల్లో ఒకటైన నాగావళి నది తీరంలోని గుడివీధి ఉమారుద్ర కోటేశ్వర స్వామి దేవస్థానం భక్తుల తాకిడితో కనిపించింది. కార్తీక మాసం రెండవ సోమవారం కావడంతో శ్రీ ఉమారుద్ర కోటేశ్వర స్వామికి ఆలయ ప్రధాన అర్చకులు ఆరవెల్లి శ్రీరామ్మూర్తి శర్మ పర్యవేక్షణలో అర్చకులు ఆరవెల్లి చంద్రశేఖర్ శర్మ వేకువ జామున విశేష అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం స్వామివారిని వివిధ రకాల పూలతో ప్రత్యేక అలంకరణ చేశారు. వేకువ జాము మూడున్నర గంటల నుంచి భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కల్పించారు. 50, 20 రూపాయల క్యూలైన్లతోపాటు ఉచిత దర్శన క్యూలైన్లకు భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి శర్మ మాట్లాడుతూ వచ్చే మూడవ సోమవారం స్వామివారికి ప్రత్యేక అలంకరణ ఉంటుందని చెప్పారు. రెండవ సోమవారం కావడంతో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేపట్టినట్లు ఆయన వివరించారు. మధ్యాహ్నానికి భక్తుల తాకిడి కాస్త తగ్గినప్పటికీ సాయంత్రానికి ఏకాదశి రావడంతో భక్తుల సందడి కనిపించింది.

### శ్రీ కామాక్షితాయి అమ్మవారికి అష్టోత్తర పుస్తకార్చన

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు జిల్లాలో ఉన్న జొన్నవాడ క్షేత్రంలో గల పురాణ ప్రసిద్ధ, 12వ శతాబ్దం నాటి శ్రీ మల్లికార్జున స్వామి కామాక్షితాయి దేవస్థానంలో అష్టోత్తర పుస్తకార్చన నిర్వహించారు. కాశిన వెంకటేశ్వరరావు, రమణమ్మ దంపతులు తమ స్వీయరచనగా జయహో శ్రీ జగజ్జనని అనే 108 పుస్తకాలతో అమ్మవారికి అర్చన జరిపించి, వాటిని భక్తులకు వితరణ చేయమని ఆలయ ఈవో అయిన ఎ.వెంకట శ్రీనివాసరెడ్డికి అందజేశారు. ఈ పుస్తకంలో నవదుర్గలు, సప్తమాతృకలు, దశ మహావిద్యలకు చెందిన 108 సుప్రసిద్ధ ఆలయాల విశేషాలను, వాటి చరిత్రను, ఆరాధనా స్తోత్రాలను పొందుపర్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు వారణాశి వెంకట గంగాప్రసాద్, సుమన్, మురళీకృష్ణ, శ్రీనివాసరావు, సంతోష్ పాల్గొన్నారు.



## సరిహద్దులు దాటేస్తున్న పీడీఎస్ రైస్





(సత్యంన్యూస్, కొత్తూరు)

పాతపట్నం నియోజకవర్గంలో పీడీఎస్ రైస్ ఎన్నిసార్లు అధికారులు పట్టుకున్నా వ్యాపారస్తులు కొత్త మార్గాలను, కొత్త పంథాలను ఎంచుకుంటూ సరిహద్దులు దాటేస్తున్నా, అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీనికి సంబంధించిన ఆ సివిల్ సప్లై అధికారులు, బోర్డర్‌లో పోలీస్ చెక్‌పోస్ట్‌లో ఉన్నప్పటికీ కూడా నిర్వహణ సరిగ్గా లేకపోవడం గమనార్హం. దాదాపు కొత్తూరు, పాతపట్నం, మెళియాపుట్టి మండలాలు ఒడిశాకు సరిహద్దున ఉండడంతో పీడీఎస్ రైస్ పెద్ద ఎత్తున దాటవేస్తున్నారు. ఆంధ్రాలో కేజీ 20 రూపాయలకు కొనుగోలు చేస్తూ ఒడిశాలో రూ.26కు అమ్ముతూ దాదాపు ప్రతినెల మూడు మండలాల్లో కలిపి 400 క్వింటాళ్ల బియ్యాన్ని దాటవేస్తూ పెద్ద మొత్తంలో అర్జిస్తున్నారు.

**బాహుబలి సహా కొన్ని చిత్రాల్లో క్యారెక్టర్ రోల్స్ చేసిన రాకేష్ వర్రే కథానాయకుడిగా 'ఉయ్యాల జంపాల' ఫేమ్ విరించి వర్మ రూపొందించిన చిత్రం.. జితేందర్ రెడ్డి. దివంగత విద్యార్థి నేత జితేందర్ రెడ్డి జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన ఈ సినిమా.. ఈ రోజే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. దీని విశేషాలేంటో చూద్దాం.**

# మెరుపు తగ్గింది!

**కథ:** జితేందర్ రెడ్డి చిన్నప్పట్నుంచి జాతీయ భావాలు కలిగిన కుర్రాడు. ఆరెస్సెస్ ప్రభావంతో అతను ప్రజల కోసం ఏదైనా చేయాలనే ఆలోచనలో ఉంటాడు. తమ ప్రాంతంలో లెఫ్ట్ భావజాలం.. నక్సలైట్ల వల్ల అభివృద్ధి ఆగిపోయిందని నమ్మిన అతను.. జనాలను చైతన్య పరచడానికి జాతీయ భావాలు పెంపొందించడం.. వారిని ప్రగతి బాట పట్టించడమే లక్ష్యంగా విద్యార్థి దశలోనే రాజకీయాల్లోకి అడుగు పెడతాడు. తన లక్ష్యం వైపు సాగే క్రమంలో అతడికి నక్సల్స్ నుంచి సమస్యలు ఎదురవుతాయి. వాటిని తట్టుకుని అంచెలంచెలుగా ఎదుగుతాడు. జనాల్లో ఆదరణ పెంచుకుంటాడు. ఎన్నికల్లో పోటీకి కూడా సిద్ధమవుతాడు. దీంతో రాజకీయ నేతలకు కూడా అతడంటే కంటగింపు మొదలవుతుంది. ఇంతమంది ప్రత్యర్థులను ఎదుర్కొని అతను నిలబడ్డాడా.. తన జీవితానికి ఎలాంటి ముగింపు లభించింది.. ఈ ప్రశ్నలకు తెర మీదే సమాధానం తెలుసుకోవాలి.

### కథనం-విశ్లేషణ:

నిజ జీవితాల్లో సినిమాలకు అవసరమైనంత డ్రామా ఉండదు. అలా అని నిజ జీవిత కథల్లో ఎక్కువ డ్రామా నింపితే వాటి సహజత్వం దెబ్బ తిని నమ్మశక్యంగా అనిపించవు. వీటిని బ్యాలెన్స్ చేస్తూ బయోపిక్స్ తీయడం కత్తి మీద సామే. 'ఎం.ఎస్. ధోని', 'మహానటి' లాంటి సినిమాలు చూసి నిజ జీవిత కథలను తెరపైకి తీసుకొచ్చే ప్రయత్నాలు చాలా జరిగాయి కానీ.. వాటిలో చాలా వరకు బోల్తా కొట్టినవే. అయినా ఆ తరహా సినిమాలు వస్తూనే ఉన్నాయి. తెలంగాణలోని జగిత్యాల ప్రాంతంలో ఒకప్పుడు విద్యార్థి నేతగా మంచి గుర్తింపు సంపాదించిన జితేందర్ రెడ్డి జీవితం గురించి ఆయన సోదరుడైన రవీందర్ రెడ్డి స్వయంగా తనే కథ రాసి సినిమాను నిర్మించాడు. అంతకుమించి ఈ సినిమా పట్ల ఆసక్తి రేకెత్తించే విషయం.. ఉయ్యాల జంపాల- మజ్ను లాంటి మంచి సినిమాలతో తన అభిరుచిని చాటిన విరించి వర్మ ఈ కథను డైరెక్ట్ చేయడం. దర్శకుడిగా తన రెండు చిత్రాలకు భిన్నమైన కథ అయినప్పటికీ విరించి వర్మ ఇందులోనూ తన అభిరుచిని.. సిన్సియారిటీని చూపించాడు. జితేందర్ రెడ్డి కథను నీట్‌గా తెరపై ప్రెజెంట్ చేశాడు.

కానీ జితేందర్ రెడ్డి కథలోనే సినిమాకు సరిపడా డ్రామా లేకపోవడం.. కథంతా ఒక ఫార్మాట్లో సాగిపోవడంతో ఈ సినిమా అంత ఎగ్జైటింగ్ గా అనిపించదు. కానీ ఉన్న కథను టీం చాలా నీట్ గా తీయడం వల్ల ఇదొక మంచి ప్రయత్నం అనిపించుకుంటుంది. నక్సలైట్ల రాజ్యం నడుస్తున్న సమయంలో వారికి ఎదురెళ్లి జనాల్లో జాతీయ వాదం పెంచడానికి.. వారిని అభివృద్ధి దిశగా నడిపించడానికి ప్రయత్నం చేసిన వ్యక్తి కథ ఇది. కథానాయకుడికి ఇలాంటి భావజాలం ఉన్నపుడు.. అదే గొప్పదని చూపించాలనుకున్నపుడు మరో భావజాలాన్ని చెడుగా చూపించడం సహజమే. ఐతే ఎన్నో ఏళ్ల నుంచి చూస్తున్న సినిమాలతో కలిగిన ఒక అభిప్రాయాన్ని తప్పు అని చూపించే ప్రయత్నంగా 'జితేందర్ రెడ్డి' కనిపిస్తుంది. నక్సలైట్లను హీరోలుగా చూపించే కథలు వన్ సైడెడ్ గా అనిపించినట్లే.. రైట్ భావజాలం ఉన్న హీరోగా కథగా 'జితేందర్ రెడ్డి' కూడా ఒక వైపే సాగుతున్నట్లు అనిపిస్తుంది. కాబట్టి ఈ సినిమా కొందరికి రుచించకపోవచ్చు. కొందరికి మాత్రం భేష్ అనిపించవచ్చు. పిల్లాడిగా ఉన్నపుడు తనకో భావజాలం ఏర్పడడానికి దారి తీసిన సంఘటనలను చక్కగా తీర్చిదిద్దాడు దర్శకుడు. ఆపై తన విద్యార్థి జీవితాన్ని.. స్టూడెంట్ లీడర్‌గా ఎదుగుదలను కూడా ఆసక్తికరంగానే మలిచాడు. ఐతే నక్సలైట్లకు తనకు మధ్య పోరు.. ఆపై రాజకీయ జీవితం.. ఈ అంశాలన్నీ రొటీన్ అనిపిస్తాయి. సన్నివేశాలు మరీ మందగమనంతో సాగడం కూడా ఇబ్బంది పెడుతుంది. ముందే అన్నట్లు పేలిపోయే సంఘటనలు లేకపోవడం వల్ల కథనం బోరింగ్‌గా అనిపిస్తుంది. ముగింపు సన్నివేశాలను మాత్రం దర్శకుడు బాగా తీర్చిదిద్దాడు. సినిమాటిక్ హై కోరుకోకుండా చరిత్రలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న ఓ వ్యక్తి జీవితాన్ని ఓపికతో చూడాలనుకుంటే 'జితేందర్ రెడ్డి'పై ఓ లుక్కేయొచ్చు.

– తుపాకి.కామ్ సౌజన్యంతో...

**బయోపిక్ తీస్తున్నారంటే ఆ వ్యక్తి గురించి ఎక్కువమందికి తెలిసి ఉంటే.. తన జీవితంలోని సంఘటలను చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకుని ఉంటే.. ఆ బయోపిక్ పట్ల ప్రేక్షకుల్లో ఆసక్తి పెరుగుతుంది. ఐతే జితేందర్ రెడ్డి జగిత్యాల ప్రాంతానికి పరిమితమైన నేత కావడం వల్ల అక్కడి వారికి తప్ప మిగతా వాళ్లు కొత్తగా తన గురించి తెలుసుకోవాల్సిందే. పైగా ఈ కథ నాలుగైదు దశాబ్దాల వెనుక నడవడం వల్ల ఆసక్తి తక్కువగానే ఉంటుంది. అలాంటపుడు ప్రేక్షకులను ఆశ్చర్యపరిచేలా సంచలన ఘటనలను సినిమాలో చూపిస్తే.. ప్రేక్షకులు ఎగ్జైట్ అవడానికి అవకాశముంటుంది. కానీ 'జితేందర్ రెడ్డి' లో అలా పేలిపోయే ఇన్సిడెంట్లు పెద్దగా కనిపించవు. మరో దర్శకుడైతే ఎక్కువ స్వేచ్ఛ తీసుకుని వీర లెవెల్లో హీరోయిజం పండించడానికి ప్రయత్నించేవాడేమో కానీ.. హీరో పాత్రను తీర్చిదిద్దే విషయంలో విరించి వర్మ కొంచెం పరిమితులు పెట్టుకున్నట్లే కనిపిస్తుంది. కొద్ది మోతాదులో సినిమాటిక్ లిబర్టీ తీసుకుని జితేందర్ పాత్రను 'హీరో' లక్షణాలను ఆపాదించడానికి ప్రయత్నించాడు. కానీ వాటి డోస్ సరిపోలేదనిపిస్తుంది. అందుకే సినిమా కొంచెం డల్లుగా నడుస్తున్న ఫీలింగ్ కలుగుతుంది. నక్సలైట్లు అంటే హీరోలని.. లెఫ్ట్ భావజాలం చాలా గొప్పదని చాటే సినిమాలు బోలెడు చూశాం. కొన్ని వందల సినిమాలు ఇదే విషయాన్ని నూరి పోస్తూ వచ్చాయి. కానీ ఇప్పుడు రైట్ భావజాలాన్ని గొప్పగా చూపించే ట్రెండ్ నడుస్తోంది. దేశం.. ధర్మం.. జాతీయ వాదం.. అంటూ జనాలకు మరో రకమైన ఐడియాలజీని ప్రభోదించే సినిమాల సంఖ్య ఇప్పుడు చాలా పెరిగింది. 'జితేందర్ రెడ్డి' కూడా ఇలా నాణేనికి మరో వైపు చూపించే ప్రయత్నమే.**

### సాంకేతిక వర్గం:

సాంకేతికంగా 'జితేందర్‌రెడ్డి'లో మంచి ప్రమాణాలు కనిపిస్తాయి. గోపీసుందర్ నేపథ్య సంగీతంతో సినిమాను డ్రైవ్ చేశాడు. ఆర్‌ఆర్ ఇంటెన్స్ గా సాగింది. పాటలు ఓకే. జ్ఞానశేఖర్ ఛాయాగ్రణం సినిమాలోని మేజర్ హైలైట్లలో ఒకటి. నాలుగైదు దశాబ్దాల కిందటి వాతావరణాన్ని తెరపైకి తీసుకురావడంలో ఆయన కెమెరా పనితనం కీలక పాత్ర పోషించింది. నిర్మాణ విలువలకు సినిమాకు అవసరమైన స్థాయిలో ఉన్నాయి. దర్శకుడు విరించి వర్మ.. తన చేతికి ఇచ్చిన కథకు వీలైనంత మేర న్యాయం చేశాడు. సినిమా నీట్‌గా తీశాడు. కానీ మరీ నెమ్మదిగా సాగే తన నరేషన్ స్టైల్ అందరికీ రుచించకపోవచ్చు. ఈ కథకు ఆ శైలే కరెక్ట్ అయినా సరే.. ప్రేక్షకులను ఎంగేజ్ చేయడం కష్టం. బేసిగ్గా సినిమాగా చెప్పేంత బలం కథలో లేకపోవడం ఇందులో లోపం కావచ్చు కానీ.. ఈ కథకు దర్శకుడిగా విరించి మాత్రం న్యాయం చేశాడు.

### నటీనటులు:

సహాయ పాత్రల్లో కనిపించిన రాకేష్ వర్రే హీరోగా తన ప్రత్యేకతను చాటుకున్నాడు. జితేందర్ రెడ్డి పాత్రలో అతను సిన్సియర్ పెర్ఫామెన్స్ ఇచ్చాడు. తన నటనలో పరిణతి కనిపిస్తుంది. పాత్రకు అవసరమైన గాంభీర్యాన్ని తీసుకురావడంలో రాకేష్ విజయవంతం అయ్యాడు. తన లుక్ కూడా బాగుంది. చాలా సన్నివేశాల్లో సటిల్ గా పెర్ఫామ్ చేసి రాకేష్ తన ప్రత్యేకతను చాటుకున్నాడు. హీరోకు జోడీగా నటించి వైశాలి ఓకే అనిపిస్తుంది. రియా సుమన్ పర్వాలేదు. నక్సలైట్ పాత్రలో ఛత్రపతి శేఖర్ తన ముద్ర వేశాడు. రవిప్రకాష్ కూడా బాగానే చేశాడు. కీలక పాత్రలో సుబ్బరాజు రాణించాడు. మిగతా ఆర్టిస్టులంతా కూడా తమ పరిధిలో బాగానే నటించారు.



# భీమేశ్వరాలయంలో భజనే వద్దన్న ఈవో



- భజనబృందాన్ని వెనక్కు పంపిన వైనం
- అన్యమతాలవారి అభ్యంతరానికి స్పందించడం సరికాదు
- అసలు ఈ కోవెల ఎలా ప్రాచుర్యంలోకి వచ్చిందో గుర్తెరగాలి
- ఈవో తీరుపై భక్తులు సైతం విమర్శలు
- పైఅధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైన భజన బృందాలు
- సాయంత్రం భజన చేసుకోండంటూ దిగివచ్చిన ఈవో

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

**కొన్నవీధి భీమేశ్వర ఆలయానికి 25 ఏళ్ల క్రితం వరకు అంతంత మాత్రంగా వచ్చే భక్తుల సంఖ్య నేడు ఎంతగానో పెరగడానికి, ఈ కోవెల ప్రాచుర్యంలోకి రావడానికి కారణం ఇక్కడ పలు బృందాలు చేసే మేలుకొలుపులు, భజన కార్యక్రమాలే. అలాంటిది కేవలం ఎవరో అన్యమతస్తులు ఫోన్ చేస్తున్నారని చెబుతూ కార్తీకంలో ప్రతీ సోమవారం చేసే భజనను ఇక్కడ పెట్టవద్దంటూ ఆపేయించారు ఈ ఆలయ ఈవో. ఈ విషయం పైఅధికారుల వరకు వెళ్లడంతో సాయంత్రం భజన పెట్టుకోవాలని ఈవో కోరారు.**

కొన్నవీధి భీమేశ్వరాలయం, తుమ్మావీధి లక్ష్మీనరసింహస్వామివారి కోవెల, అలాగే దూదివారి కోవెల (చిన్నబజారు వేంకటేశ్వర ఆలయం) ఈవో మాధవి పరిధిలోకి వస్తాయి. ఈమె ఎప్పుడో చుట్టంచూపుగా ఈ ఆలయాలకు వచ్చి బయటి నుంచి చూసుకొని వెళ్లిపోవడమే తప్ప, ఈ ఆలయాల పరిసరాలను సైతం కనీసం పట్టించుకున్న దాఖలాలే లేవని ఆలయ పూజారులే ఆరోపిస్తున్నారు. కార్తీకంలో భక్తుల రద్దీ అధికంగా ఉండటం, ఆలయానికి ఆదాయం వచ్చే సమయం కావడంతో భీమేశ్వరాలయానికి చుట్టంచూపుగా సోమవారాలు వచ్చి కొద్ది సేపు ఉండి వెళ్లిపోతుంటారు. గతంలో ఉండే ఈవోలు ఇక్కడ భజన జరిపే భక్త బృందాలను అభినందిస్తూ వారికి టీ, టిఫిన్ వంటి కనీస సౌకర్యాలు వారంతట వారే అందించేవారు. అయితే ప్రస్తుతం కొత్తగా (అంటే ఏడాది దాటిందిలెండి) వచ్చిన ఈవో మాధవి మాత్రం భజన బృందాలను కనీసం పట్టించుకోపోవడం శివుడెరుగు.. కార్తీక మొదటి వారమే భజన చేస్తుండగా మైకులు సౌండ్ తగ్గించేయడం, ఆపేయడం చేశారు. తీరా రెండోవారం ఎవరో కంప్లైంట్ ఇస్తున్నారంటూ వచ్చి భజనే చేయొద్దని బృందాన్ని వెనక్కి పంపారు. కోవెల బయట నుంచి చూసుకుని వెళ్లిపోయే ఈమె భజన ఆపించేయడం పట్ల ఆలయానికి వచ్చే భక్తులు ప్రశ్నిస్తున్నారు. తమ మనోభావాలు దెబ్బతింటున్నాయని, ఇది సరికాదని, ఎవరో ఒక అన్యమతస్తుడు ఫిర్యాదు చేశాడన్న నెపంతో ఈవో స్థాయి వ్యక్తి స్వామివారి సన్నిధిలో భజన ఆపించేయడం సరికాదంటున్నారు. గంటో రెండో గంటలో ఆలయ సన్నిధిలో చేసే భజనను ఆపే ఈవో మాధవి హిందువు కాదా అని ప్రశ్నిస్తున్నారు. దీనిపై పలు భజన బృందాలతో కలిసి పైస్థాయి అధికారులకు ఫిర్యాదు చేయడానికి భీమేశ్వర భజన బృందం సభ్యులు సిద్ధమవుతున్నారు. దీనిపై పైస్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. భీమేశ్వర దర్శనానికి వచ్చే భక్తులకు ఆదాయం కోసం పలు మార్గాలు ఏర్పాటుచేసే ఆలోచన ఉన్న ఈవోకు ఎవరో ఒక వ్యక్తి ఫోన్ చేసినప్పుడు ఆమాత్రం సమాధానం చెప్పుకోలేరా అని భక్తులు విమర్శిస్తున్నారు.

## 25 సంవత్సరాలుగా..

గత 25 సంవత్సరాలుగా నిరంతరాయంగా ఆలయ విశిష్టత నగర చుట్టుపక్కల తెలిసేలా వివిధ భజన బృందాలను మిళితం చేసుకొని ధనుర్మాస మేలుకొలుపులు నిర్వహించింది భీమేశ్వర భజన బృందం. అలాగే సంక్రాంతి నాడు 24 గంటలపాటు భజన (ఏకాహం) నిర్వహించడం, ప్రతీ శివరాత్రి నాడు, కార్తీక సోమవారాల్లో రూపాయి కూడా తీసుకోకుండా ఉదయంపూట రెండు మూడు గంటలు భజన చేసేవారు. ఈ మేలుకొలుపులతో పాటు నగరంలో తిరువీధి నిర్వహించడంతో రోడ్డుపక్కనే ఉన్న కొన్న వీధికి వెనుకవైపు జంగాలవీధిలో ఉన్న ఈ ఆలయం గురించి ప్రజలకు తెలిసిందన్న విషయాన్ని ఈవో మాధవి మర్చిపోకూడదు.



## మారిన ఈవో మనసు

స్థానిక కొన్నవీధిలో కొలువై ఉన్న శ్రీ రాజరాజేశ్వరి సహిత భీమేశ్వర ఆలయానికి భక్తులు పోటెత్తారు. సోమవారం ఉదయం 3 గంటల నుంచే భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. తెల్లవారుజాము నుంచి భక్తులు స్వామిని దర్శించుకునేందుకు బారులు తీరారు. ఈ సందర్భంగా కొందరు ఉచిత ప్రసాదాలను అందజేశారు. కాగా భజన ఆపేయించిన విషయం పైఅధికారుల వరకు వెళ్లడంతో వారి సూచన మేరకు సాయంత్రం భజన చేయించుకోవాలని ఈవో కోరారు.

# భోగాపురం పనుల్లో కీలక పురోగతి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)


- 50 శాతం పూర్తయిన విమానాశ్రయ నిర్మాణాలు
- 6వ సారి పనులను పరిశీలించిన కేంద్ర మంత్రి రాము
- జూన్ 2026 నాటికి పూర్తి చేస్తామని వెల్లడి

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించే భోగాపురం ఎయిర్ పోర్టు పనులను లక్ష్యం కంటే ముందుగానే 2026 జూన్ నాటికి పూర్తి చేస్తామని కేంద్ర పౌరవిమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు వెల్లడించారు. దీనికనుగుణంగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. కేంద్రమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆదివారం 6వ సారి ఆయన భోగాపురం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనులు చేపడుతున్న జీఎంఆర్ ఇన్‌ఫ్రా అధికారులతో పరిశీలించారు. ప్రధాన టెర్మినల్ భవనం, ఏటీసీ టవర్, ఏప్రాన్, డ్రైనేజీ వ్యవస్థ, ఏరో బ్రిడ్జులు, కార్యాలయ భవనాలను తనిఖీ చేశారు. అనంతరం సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. గత 4నెలల్లో పనుల్లో కీలక పురోగతి సాధించామని, 50శాతం పనులు పూర్తయ్యాయని ఈ సందర్భంగా జీఎంఆర్ అధికారులు మంత్రికి వివరించారు. భోగాపురం పూర్తి చేయడం ద్వారా ఉత్తరాంధ్రకు తలమానికంగా నిలవడంతో పాటు రాష్ట్ర అభివృద్ధిలో కీలకంగా తీర్చిదిద్దవచ్చని కేంద్రమంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. పరిశీలనలో ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక 31వ డివిజన్ పరిధిలోని పలు వీధుల్లో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం డివిజన్ ఇన్‌ఛార్జి విభూతి సూరిబాబు ఆధ్వర్యంలో జోరుగా కొనసాగుతోంది. సోమవారం చాకలివీధిలో జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో సూరిబాబు మాట్లాడుతూ పార్టీ కార్యకర్తల సంక్షేమమే టీడీపీ లక్ష్యమని, పార్టీ కార్యకర్తల కోసం టీడీపీ అధిష్టానం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో రాంబాబు, సుభాష్, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు. **- సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్**



# ప్రజామోదం మేరకే మాస్టర్ ప్లాన్




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)


- అభ్యంతరాలు పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందిస్తాం
- సర్క్యులేషన్ పెట్రన్ త్వరలోనే అమలులోకి వస్తుంది
- ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్ చర్చ వేదికలో ఎమ్మెల్యే శంకర్

ప్రజామోదం మేరకే మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. బాపూజీ కళామందిర్‌లో ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్‌పై ఆదివారం చర్చావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్‌ను గతంలోనే రూపొందించారని, తాను ఎమ్మెల్యే అయిన వెంటనే మాస్టర్ ప్లాన్‌ను పూర్తిస్థాయిలో రూపొందించేందుకు ప్రభుత్వానికి మరికొంత సమయం కోరినట్టు చెప్పారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించి ఆ సూచనలు, సలహాలను పొందుపరిచి మాస్టర్ ప్లాన్‌ను ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ఇంకా ఆలస్యం చేస్తే అమృత్ పథకం ద్వారా రావలసిన నిధులు వెనక్కి వెళ్లిపోతాయని, మాస్టర్ ప్లాన్ అమల్లోకి వస్తే నియోజకవర్గ రూపురేఖలే మారిపోతాయని పేర్కొ న్నారు. ఇంజనీర్లకు, ప్రజలకు, నిర్మాణదారులకు ఇబ్బందులు లేకుండా త్వరలోనే సర్క్యులేషన్ ప్యాట్రన్ కూడా అమలులోకి వస్తుందని, తద్వారా ఇంజనీర్లకు, ప్రజలకు ఎంతో సులభతరంగా ఉంటుందన్నారు. మాస్టర్ ప్లాన్‌కు సంబంధించి ప్రజల నుంచి 155 అభ్యంతరాలు అందాయని, వీలైనంత త్వరగా వీటిని పరిశీలించి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాల్సిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ప్రసాద్, ఎంఈ, టీపీవో ఉమామహేశ్వరరావు, ఇతర మున్సిపల్ అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఇంజనీర్లు, ఎల్‌టీపీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వైభవంగా తూర్పుకాపుల వనసమారాధన

(సత్యంన్యూస్, రాజమండ్రి)

ఆంధ్రప్రదేశ్ తూర్పుకాపు సంక్షేమ సంఘం రాజమండ్రి శాట్ లైట్ సిటీ శాఖ ఆధ్వర్యంలో తూర్పుకాపు జాతి వనసమారాధన, సమావేశం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిధులుగా ఆలిండియా తూర్పుకాపు సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు పిసిని చంద్రమోహన్, రాష్ట్ర అధ్యక్షులు ఆకుల అప్పలసూరినాయుడు, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాష్, రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, స్థానిక ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి, బీజేపీ మాజీ రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు, ఏపీటీకేఎస్ఎస్ ఓబీసీ సాధన కమిటీ చైర్మన్ పల్లా వెంకటరావు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు బద్దుకొండ వెంకటరమణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిరాజు రాజారావు, రాష్ట్ర కార్యదర్శి ఇజ్జవరపు శ్రీనివాస్, ఏపీటీకేజేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలిశెట్టి అచ్చెన్నాయుడు, ఏపీటీకే జేఏసీ రాష్ట్ర కార్యదర్శి చనమళ్ల వెంకటరమణ, ఏఐటీకేఎస్ఎస్ యువజన విభాగం జాతీయ అధ్యక్షులు ధనుకొండ లక్ష్మణ్ నాయుడు, మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మజ్జి పద్మావతి, స్థానిక ఎంపీడీవో శ్రీనివాస్, ఏపీటీకేఎస్ఎస్ యువజన విభాగ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కోట్ల క్రిష్ణ, ఏపీటీకేఎస్ఎస్ విజయనగరం జిల్లా అధ్యక్షులు తుమ్మగంటి రామ్మోహన్, విశాఖపట్నం జిల్లా కోశాధికారి కడగల చిన్నారావు, తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శులు సురేష్, రాజమండ్రి శాట్‌లైట్ సిటీ అధ్యక్షులు యర్రా ఈశ్వరరావు, స్థానిక ప్రధాన కార్యదర్శి రుంకాన రవికుమార్‌లు తూర్పుకాపు జాతి ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై మాట్లాడారు. ఈ సమావేశంలో వేలాది మంది తూర్పుకాపు జాతి అభ్యుదయవాదులు పాల్గొన్నారు.



# తైక్వాండోలో నలుగురికి పతకాలు

(సత్యంన్యూస్, ఆమదాలవలస)

శ్రీకాకుళంలో జరిగిన తైక్వాండో సబ్ జూనియర్ కేటగిరి పోటీల్లో ఆమదాలవలసకు చెందిన నలుగురు అమ్మాయిలకు విజయాలు వరించాయి. అందులో ఒకరు బంగారు పతకం, ముగ్గురు వెండి పథకాలు అందుకున్నట్టు కోచ్ ఎస్ఎం పురం నాగలక్ష్మి తెలిపారు. అందులో బెండీ నిఖిలప్రియకు బంగారు పతకం, తమ్మన వెంకట నాగ రామ దేవన్షికి వెండి పతకం, కంచరాన భావన భరద్వాజ్‌కు వెండి పతకం, బొద్దాన వివేక వర్షినికి వెండి పతకం లభించాయి. వీరు నలుగురు రాష్ట్రస్థాయి పోటీలతో ఎంపికయ్యారని ఆ తైక్వాండో కోచ్ నాగలక్ష్మి తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలు ప్రకాశం జిల్లాలో ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ చేతుల మీదగా బహుమతి, సర్టిఫికెట్లు అందించారు.




# పూర్వవైభవం దిశగా పట్టణ నైట్ షెల్టర్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పేదల పట్టణ నిర్మూలన వ్యవస్థ (నైట్ షెల్టర్)కు పూర్వవైభవం దక్కేనా అంటే అవుననే చెప్పాలి. నిత్యసేవకుల శ్రమ ఫలించిందని రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ కమిటీ సభ్యులు కొంక్యాన వేణుగోపాల్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు శాసపు జోగినాయుడు అన్నారు. కేంద్ర, రాష్ట్ర నిధులతో నడపబడుతున్న గొంటివీధిలోని పేదల పట్టణ నిర్మూలన వ్యవస్థ (నైట్ షెల్టర్) గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు ఆగిపోవడంతో అస్తవ్యస్తంగా మారిందన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పలు సంస్థ సభ్యులు ప్రతి నిత్యం ఇక్కడ ఉండే నిరాశ్రయ నిరుపేదలకు ఆపన్నహస్తంగా ఉంటూ, దాతల సహకారంతో ఆహారాన్ని అందిస్తున్నారు. కొన్ని రోజుల ముందు కలెక్టర్ స్వప్నిల్ పుండ్కర్‌ను కలసి నైట్‌షెల్టర్ ప్రస్తావన తెచ్చామని, నగర మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌ను సైతం కలసి సమస్యలను వివరించగా, సానుకూలంగా స్పందించారు.

నగరానికి జీవన్‌సింగ్ చంద్రావత్, గీత కున్వర్ చంద్రావత్, కుమారుడు దేవేంద్ర సింగ్ చంద్రావత్ జన్మదినం సందర్భంగా నైట్ షెల్టర్‌లో నిరుపేదలకు అల్పాహారం అందించారు. అనంతరం మాట్లాడుతూ తన కుమారుడు జన్మదినాన సేవా కార్యక్రమం చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో న్యాయవాది శాసపు గౌరీశ్వరమ్మ, ఉర్లాం శివతేజ, మదర్స్ హెల్పింగ్ సొసైటీ డాక్టర్ ప్రదీప్, ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్ నంది ఉమాశంకర్, జి.పవన్‌కుమార్, బొట్టా సాయికుమార్, అన్నదాతలు జీవన్ సింగ్ చంద్రావత్, గీత కున్వర్ చంద్రావత్, కుమారుడు దేవేంద్ర సింగ్ చంద్రావత్, సోదరి డింపుల్ కున్వర్ చంద్రావత్, నైట్ షెల్టర్ సభ్యులు పాల్గొన్నారు.



SriAaKaSa
YOUR TRUSTED PARTNER IN THE DISTANCE EDUCATION SECTOR.
Join our Earn while Learn program and get a job within 40 days after joining.
LAST DATE: AUGUST-28
91330 06999 Courses 92466 36411
10th, Intermediate
BA (all groups), B.Com, BLiSc, B.SC (all groups), BBA, BCA (with Market trending specialisations)
MA (all subjects), M. Com, MBA, MCA, M. SC (All Subjects), MLiSc, M.Tech
Computer Applications, Cyber Security, Digital Marketing, Hospital Management, Tourism Management

ఎం.ఇర్షాద్
USHA ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

MNM
బెంగుళూర్ అయ్యంగార్ బేకరి
BSNL ఆఫీస్ ప్రక్కన, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
సెల్: 76759 18522


'సత్యం'లో ప్రకటనల కొరకు సంప్రదించండి
8019 221 221

మెట్రో సోఫా వర్క్స్
అన్ని రకముల సోఫాలు, ఫర్నిచర్ మేనుఫేక్చర్స్ (హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

జై శ్రీమన్నారాయణ
శ్రీ క్రిష్ణ ఆన్‌లైన్ సర్వీసెస్
మావద్ద అన్ని రకముల జాబ్ అప్లికేషన్స్ ఆన్‌లైన్ చేయబడును.
సెల్: 93938 41308
రైల్వే రిజర్వేషన్లు, బస్ రిజర్వేషన్ సదుపాయం కలదు.

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE WOMEN'S COLLEGE ROAD, SRIKAKULAM - 532 001




## మొండేటివీధిలో దీపారాధనకు
# కొలను ఏర్పాటు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మొండేటివీధిలోని శ్రీ లలితాదేవి సహిత శివ కామేశ్వర ఆలయంలో సోమవారం నుంచి నీటికొలను ఏర్పాటు చేశారు. దీపాలను ఆ నీటిలో వదలవచ్చని స్థానిక శ్రీ షిరిడిసాయి సేవా సంఘం ప్రతినిధులు తెలిపారు. తులసి చెట్టు, ఉసిరిచెట్టు, మారేడుచెట్టు, జమ్మిచెట్టు, రావిచెట్టు తదితర మొక్కల్ని ప్రదర్శనలకు వీలుగా ఏర్పాటు చేశామని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

# రూ.43,402 కోట్లతో వ్యవసాయ బడ్జెట్

(సత్యంన్యూస్, అమరావతి)

ఏపీ అసెంబ్లీలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు రూ.43,402 కోట్లతో వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి వ్యవసాయం వెన్నెముక లాంటిదని అన్నారు. 62 శాతం జనాభా వ్యవసాయ అనుబంధ రంగాలపై ఆధారపడిందని చెప్పారు. గత ప్రభుత్వం వ్యవసాయాన్ని గాలికొదిలేసిందని విమర్శించారు. భూసార పరీక్షలకు తిరిగి ప్రాధాన్యమిస్తున్నామని, ఇందుకు రిమోట్ సెన్సింగ్ సాంకేతికత ఉపయోగిస్తామని చెప్పారు. విత్తనాలు, సూక్ష్మ పోషక ఎరువులు రాయితీపై అందిస్తున్నామన్నారు. ప్రాథమిక పరపతి సంఘాల ద్వారా ఎరువుల పంపిణీ చేస్తున్నామని వివరించారు.

**వ్యవసాయ బడ్జెట్ కేటాయింపులిలా..**

**అన్నదాత సుఖీభవ - రూ.4,500 కోట్లు, రాయితీ విత్తనాలకు - రూ.240 కోట్లు, భూసార పరీక్షలకు - రూ.38.88 కోట్లు, విత్తనాల పంపిణీ - రూ.240 కోట్లు, ఎరువుల సరఫరా - రూ.40 కోట్లు, పొలం పిలుస్తోంది - రూ.11.31 కోట్లు., ప్రకృతి వ్యవసాయం - రూ.422.96 కోట్లు, డిజిటల్ వ్యవసాయం - రూ.44.77 కోట్లు, వ్యవసాయ యాంత్రీకరణ - రూ.187.68 కోట్లు, వడ్డీ లేని రుణాలకు - రూ.628 కోట్లు, రైతు సేవా కేంద్రాలకు - రూ.26.92 కోట్లు, ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్స్ - రూ.44.03 కోట్లు, పంటల బీమా - రూ.1,023 కోట్లు, వ్యవసాయ శాఖ - రూ.8,564.37 కోట్లు, ఉద్యాన శాఖ - రూ. 3469.47 కోట్లు, పట్టు పరిశ్రమ - రూ.108.4429 కోట్లు, వ్యవసాయ మార్కెటింగ్ - రూ.314.80 కోట్లు, సహకార శాఖ - రూ.308.26కోట్లు, ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం - రూ.507.038 కోట్లు, ఉద్యాన విశ్వవిద్యాలయం - రూ.102.227 కోట్లు, శ్రీ వెంకటేశ్వర పశు విశ్వవిద్యాలయం - రూ.171.72 కోట్లు, మత్స్య విశ్వవిద్యాలయం - రూ.38 కోట్లు, పశుసంవర్ధక శాఖ - రూ.1,095.71 కోట్లు, మత్స్య రంగం అభివృద్ధి - రూ.521.34 కోట్లు, ఉచిత వ్యవసాయ విద్యుత్ - రూ.7241.30 కోట్లు, ఉపాధి హామీ అనుసంధానం - రూ.5,150కోట్లు, ఎన్టీఆర్ జలసిరి - రూ.50 కోట్లు, నీటిపారుదల ప్రాజెక్టుల నిర్వహణ - రూ.14,637.03 కోట్లు**



# మధ్యాహ్న భోజన కార్మికులపై రాజకీయ వేధింపులు ఆపండి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులపై రాజకీయ వేధింపులు, తొలగింపులు వెంటనే ఆపాలని లేకపోతే పోరాటాలు తీవ్రతరం చేస్తామని ఏపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు అల్లు.మహాలక్ష్మి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.సుశీల, బి.ఉత్తర సిఐటియు జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు సి.హెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు డిమాండ్ చేసారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన మధ్యాహ్న భోజన కార్మికులపై రాజకీయ వేధింపులతో కార్మికుల తొలగింపులు ఆపాలని, ఉపాధిభద్రత కల్పించాలని, కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం శ్రీకాకుళం డిఇఓ కార్యాలయం వద్ద ఏపీ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేసారు. ఈ సందర్భంగా నిరసన దీక్షనుద్దేశించి వారు మాట్లాడుతూ ఒక ప్రక్క పనిభారం, మరోప్రక్క ధరల భారంతో పెరుగని వేతనాలు, అతి తక్కువ మెనూ చార్జీలతో కార్మికులు పథకం నిర్వహించటం కష్టసాధ్యంగా మారిందని ఆవేదన వ్యక్తం చేసారు. పథకంలో పనిచేస్తున్న కార్మికులను కార్మికులుగా గుర్తించి కనీసం 10 వేల రూపాయలు ఇవ్వాలని, ప్రతి నెలా 5 వ తేది లోపు వేతనాలు, బిల్లులు ఇవ్వాలని డిమాండ్ చేసారు. కనీసం రూ.20/-లు మెనూ చార్జీలకు ఇవ్వాలని, వంట గ్యాసు ప్రభుత్వమే సరఫరా చేయాలని, పథకం అమలుకు వంట షెడ్లు, మంచినీరు, గౌజ్లు, మాస్కులు, యాప్రాన్ వంటి కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. 23ఏళ్ల నుండి పని చేస్తున్న మధ్యాహ్నం భోజన పథకం కార్మికులతో ప్రభుత్వం వెట్టిచాకిరి చేయించుకుంటుందన్నారు. పథకం అమలుకు పాఠశాలలో వంటషెడ్లు, మంచినీరు, గ్యాస్ సరఫరా వంటి మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వానికి శ్రద్ధలేదని విమర్శించారు. సెంట్రలైజ్డ్ కిచెన్ పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని జిల్లాల్లో ప్రైవేటు సంస్థలకు, అక్షయపాత్ర, ఇస్కాన్ వంటి ఆధ్యాత్మిక సంస్థలకు ఈ పథకాన్ని ప్రభుత్వం కట్టబెడుతుంది. దీని వలన రుచి లేని, పాచిపోయిన భోజనం పెడుతున్నారని, ప్రైవేటు సంస్థలు నిర్వహిస్తున్న చోట వారికి పథకాన్ని రద్దుచేసి వర్కర్లతో పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేసారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేసారు. సంవత్సరానికి 2 జతల యూనిఫామ్ ఇవ్వాలని, 2 నెలలకు ఒకసారి వర్కర్లతో ఎంఇఓలు సమావేశాలు పెట్టాలని, టిఎ ఇవ్వాలని, హైస్కూల్లో పని చేస్తున్న వర్కర్లకు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేసారు.దీక్షా శిబిరం దగ్గరకి డిఈఓ వచ్చియూనియన్ నాయకుల నుంచి వినతిపత్రం తీసుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్తామని హామీ ఇచ్చారు. కార్మికుల పోరాటానికి సిఐటియు జిల్లా కార్యదర్శి, జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య, యూటీయఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్, ఎన్.వి.రమణ, ఎస్.యఫ్.ఐ జిల్లా కార్యదర్శి బి. హరీష్, నాయకులు పి. భగేష్ మద్దతు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో టి. సీతమ్మ, కె.కౌసల్య, ఎన్.గీతాబాల, టి.ప్రవీణ, డి.జమ్మలు, వై.లక్ష్మి, రాములమ్మ, భూదేవి పాత్రో తదితరులు పాల్గొన్నారు.

# మైనారిటీలను అభివృద్ధి చేసింది టీడీపీయే



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మైనార్టీలకు అన్ని విధాలుగా అభివృద్ధి సంక్షేమం అందించి ముందుకు నడిపించే పార్టీ తెలుగుదేశం పార్టీ అని నగర టీడీపీ అధ్యక్షులు మాదారపు వెంకటేష్ పేర్కొన్నారు. ఈమేరకు సోమవారం స్థానిక 22వ డివిజన్‌లో నగర ముస్లిం మైనార్టీ విభాగం అధ్యక్షుడు నిజాముద్దీన్, బహదూర్ బాషా, ఎండి రఫీ ఆధ్వర్యంలో ముస్లిం యువత, మహిళలల పర్యవేక్షణలో సభ్యత్వ నమోదు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. నగర ముస్లిం మైనారిటీ అధ్యక్షులు నిజాముద్దీన్, ప్రధానమంత్రి 15సూత్రాల అమలు కమిటీ మాజీ సభ్యులు బహదూర్ భాషా, ఎండి.రఫీ, నియోజకవర్గ సభ్యత్వ నమోదు పర్యవేక్షకులు అజయ్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాదారపు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, లోకేష్‌లు పార్టీ కార్యకర్తలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారన్నారు. దీనిలో భాగంగా యాక్సిడెంటల్ డెత్‌కు రూ.2నుంచి 5లక్షల వరకు బీమా సౌకర్యం కల్పిస్తున్నారన్నారు. ముస్లిం మైనారిటీల సంక్షేమం కోసం టీడీపీ అన్ని విధాలుగా అండగా నిలిచి రంజాన్ తొఫా, దుల్హన్ పథకం, రుణాలు మంజూరు ఎన్నో విధాలుగా స్వయం ఉపాధికి శిక్షణ అందించి అన్ని విధాలుగా సహకరించిందన్నారు. ఇపుడు కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, నారా లోకేష్‌లతోపాటు ఎమ్మెల్యే గొండు శంకర్‌లు నగర అభివృద్ధి కోసం పాటు పడుతున్నారన్నారు. దీనికి గానూ వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.




బాలల దినోత్సవం సందర్భంగా జీఈవో (గ్లోబల్ ఎంపవర్మెంట్ ఆర్గనైజేసన్), కెరీర్‌ఫెయిర్ సంయుక్తంగా నిర్వహిస్తున్న వారోత్సవాలలో భాగంగా స్థానిక ఏపీహెచ్‌బీ కాలనీనందు గల ఆక్సఫర్డ్ పాఠశాలలో చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆక్స ఫర్డ్ ప్రధానోపాధ్యాయులు బి.కిరణ్, జీఈవో ఆర్గనైజేషన్ సద్గుణ, బాబాలను అభినందించారు. వరం పాఠశాల చిత్రలేఖన ఉపాధ్యాయులు వై.సత్యన్నారాయణ, జాడ సాయి, ఉర్లం. శివ తేజ, వరం, ఆక్స్ఫర్డ్, ఎన్టీఆర్ పాఠశాలతోపాటు కొన్ని పాఠశాలల విద్యార్థినీ, విద్యా ర్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.- **సత్యంన్యూస్, శ్రీకాకుళం**

# పట్టపగలే డిక్కీలో బంగారం కొట్టేశారు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం క్రైమ్)

స్థానిక జీటీ రోడ్డులో ఆర్‌కే షాపింగ్‌మాల్ ఎదురుగా సెంటర్ పార్కింగ్‌లో పెట్టిన స్కూటర్ సీటు కింద డిక్కీని లేపేసి అందులో ఉన్న మూడు తులాల బంగారంతో పాటు రూ.35వేలు నగదును పట్టపగలే దొంగలు లేపేశారు. వివరాల్లోకి వెళితే.. స్థానిక మొండేటివీధిలో నివాసముంటున్న చప్పటి సతీష్ రామకృష్ణా థియేటర్ సందులో ఉన్న కెనరా బ్యాంక్‌లో తాకట్టులో ఉన్న మూడు తులాల బంగారాన్ని (నాలుగు చైన్లు, ఫిష్ లాకెట్‌తో కలిపి) శుక్రవారం ఉదయం విడిపించారు. అనంతరం వన్ గ్రామ్ గోల్డ్ వ్యాపారం చేస్తున్న సతీష్ స్థానికంగా కలెక్షన్లు చూసుకుని ఆ మొత్తం రూ.35వేలు, బ్యాంకు నుంచి విడిపించిన బంగారాన్ని, ఆరు ఏటీఎం కార్డులు, రెండు క్రెడిట్ కార్డులు, రెండు పాన్‌కార్డులు (భార్య కార్డుతో కలిపి), ఆధార్ కార్డులున్న బ్యాగులో పెట్టి ఏపీ 39 ఎఫ్ఏ 2468 సుజికి యాక్సెస్ స్కూటీ సీటు కింద డిక్కీలో పెట్టారు. అనంతరం ఆర్‌కే షాపింగ్‌మాల్‌కు ఆయన బంధువులు వచ్చారని ఫోన్ రావడంతో ఎదురుగా ఉన్న సెంటర్ పార్కింగ్‌లో బండిని నిలిపి వారిని కలవడానికి వెళ్లారు. సరిగ్గా 11.30 గంటల సమయంలో గుర్తు తెలియని దుండగుడు పార్కింగ్‌లో ఉన్న డిక్కీని బలవంతంగా తెరిచి, అందులో డబ్బు, బంగారం, కార్డులు ఉన్న బ్యాగును పట్టుకుపోయాడు. ఎదురుగా ఉన్న సన్‌సిల్వర్ పార్క్ సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలిస్తే నలుగురు వ్యక్తులు రెండు వాహనాల మీద సతీష్‌ను అనుసరించి వచ్చినట్లు అర్థమవుతుంది. ఇందులో పార్కింగ్‌లో ఉన్న బండి డిక్కీని దుండగుడు తెరుస్తున్నప్పుడు సెక్యూరిటీగా ఒకడు రోడ్డుపై కాపలా కాయగా, మరో ఇద్దరు ఆర్‌కే షాపింగ్‌మాల్‌లోకి వెళ్లిన సతీష్ కదలికలను పరిశీలించి, బయటకు సమాచారం అందించడానికి వెళ్లినట్లు తెలుస్తుంది. దీని మీద టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ పి.ఈశ్వరరావు ఎఫ్ఐఆర్ నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



# పటిష్టంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం అమలు

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

ఎస్సీ, ఎస్టీలపై అత్యాచారాలు, దాడులు నిరోధించటానికి, బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు భారత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం పటిష్టంగా అమలు చేస్తున్నదని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. బాధితులకు తగిన రక్షణ, పునరావాసం, వివక్షత, వేధింపుల నుంచి రక్షణ కల్పించడం దీని లక్ష్యమని, ఈ చట్టంపై సంపూర్ణ అవగాహన చేసుకొని, దానిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ నేర పరిశోధనా విభాగం (ఏపి, సిఐడి), విశాఖపట్నం ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో చిలకపాలెం, శివాని ఇంజినీరింగ్ కళాశాలలో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం-1989పై ఒకరోజు వర్క్‌షాపు సోమవారం నిర్వహించారు. సిఐడి అదనపు ఎస్పీ ప్రేమకాజల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సన్యాసినాయుడు మాట్లాడుతూ సుమారు 35 ఏళ్ల క్రితం ఈ చట్టం అమల్లోకి వచ్చినప్పటికీ, దీనిపై ఇప్పటికీ చాలా మందికి సంపూర్ణ అవగాహన లేదని చెప్పారు. ఎస్సీ, ఎస్టీల సంరక్షణ కోసం చేసిన ఈ చట్టం వల్ల ఎంతోమందికి ప్రయోజనం చేకూరిందని, వారి హక్కులు పరిరక్షణ జరిగిందన్నారు. కొన్ని ఇతర చట్టాల మాదిరిగానే అప్పుడప్పుడూ ఈ చట్టాన్ని కూడా దుర్వినియోగం చేస్తున్న సంఘటనలు కూడా ఉన్నాయన్నారు. ఇప్పటికీ పలుచోట్ల అసమానతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని, జిల్లాకు చెందిన జస్టిస్ పున్నయ్య చేసిన కృషిని ఈసందర్భంగా వివరించారు. ఈ కేసుల్లో కోర్టు ఫీజు పూర్తిగా మినహాయింపు ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో పాల్గొన్న టెక్కలి, కొత్తూరు, పలాస జూనియర్ సివిల్‌జడ్జిలు చక్రవర్తి, వాణి, వి.మాధురిలు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల రక్షణ కోసం రూపొందించిన ఈ చట్టంపై ఉన్న అపోహలను తొలగించి, పలు ఉదాహరణలు వివరించారు. పలు సెక్షన్లు, చాప్టర్లుపై విశదీకరించారు. నేటి విద్యార్థులంతా కుల వివక్షత, అంటరానితనం తదితర సామాజిక దురాగతాలను రూపుమాపేందుకు తమ వంతు కృషి చేయాలన్నారు. సీఐడీ విశాఖ అదనపు ఎస్పి జి.ప్రేమ్ కాజల్ మాట్లాడుతూ, వర్క్‌షాప్ నిర్వహణ వెనుక మఖ్య ఉద్దేశ్యాన్ని వివరించారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టంపై ప్రజలకు సంపూర్ణ అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో రాష్ట్రంలో వివిధచోట్ల ఏపీ, సీఐడీ ఆధ్వర్యంలో సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తమ పరిధిలో మొదటిసదస్సును అనకాపల్లి, రెండోది ఎల్.కోట, మూడోది శ్రీకాకుళం జిల్లాలో ఏర్పాటు చేశామన్నారు. ఈ చట్టాన్ని వివరిస్తూ తమ విభాగం ప్రత్యేకంగా ప్రచురించిన పుస్తకాలను కూడా పంపిణీ చేస్తున్నామని, విద్యార్థులకి చట్టంపై అవగాహన కోసం పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా అదనపు ఎస్పీ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కులం ఆధారంగా ఎవరినీ చిన్నచూపు చూడకూడదని, వేధింపులకు గురి చేయకూడదన్నదే ఈ చట్టం ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు. కుల వివక్షత అన్నది హీనమైన నేరమని, వివక్షతను చూపిస్తే ఈ చట్టం ప్రకారం కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సదస్సులో ముందుగా బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రాజు, సీఐడీ డీఎస్పీ ఎంఎన్ భూపాల్, సీఐలు బీవీడీ ప్రసాద్, వై.రవి, అవతారం, ఎస్ఐ స్వర్ణలత, సాంఘిక సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ కృష్ణవేణి, జిల్లా విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు కంఠ వేణు, అంబేద్కర్ ఇండియా మిషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తైక్వాండో శ్రీను, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.




# విద్యాభివృద్ధికి బీజం వేసిన స్ఫూర్తిదాత మౌలానా

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

భారతదేశ స్వాతంత్ర్య సమరంలో కీలకపాత్ర పోషించడంతో పాటు దేశ విద్యాభివృద్ధికి పటిష్టమైన బీజం వేసిన స్ఫూర్తిదాత భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని వక్తలు పేర్కొన్నారు. స్వాతంత్ర్యం అనంతరం దేశంలో యూజీసీతో పాటు ఐఐటీ ఏర్పాటుకు కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. గాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధుల స్మృతివనంలో భారతరత్న అబుల్ కలాం ఆజాద్ 136వ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విగ్రహ దాతలు మహిబుల్లాఖాన్‌తో పాటు ప్రముఖులు సురంగి మోహనరావు, మేదూరి ప్రసాదరావు, పొన్నాడ రవికుమార్, కొంక్యాన వేణుగోపాల్ తదితర బృందం మౌలానా విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా సురంగి మోహనరావు, ఎం.ప్రసాదరావు మాట్లాడుతూ భారత స్వాతంత్ర్యం కోసం పరితపించిన దేశభక్తుడు మౌలానా అని అన్నారు. విగ్రహ దాత మహిబుల్లా ఖాన్ మాట్లాడుతూ దేశ సాహిత్య విద్యా వికాసం కోసం మౌలానా కృషి చిరస్మరణీయమైనదన్నారు. అనంతరం మౌలానా గొప్పతనాన్ని కీర్తిస్తూ అవధాన పండితులు పైడి హరనాథరావు గేయాన్ని ఆలపించారు. మైనార్టీ సంఘ పెద్దలు అమీరుల్లా బేగ్‌ను సత్కరించారు. కార్యక్రమంలో వివిధ రంగాల ప్రముఖులు నిక్కు అప్పన్న, పందిరి అప్పారావు, కొమ్ము రమణమూర్తి, నక్క శంకరరావు, శాసపు జోగినాయుడు, పెంకి చైతన్యకుమార్, షాను తదితరులున్నారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.